జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | 31 | జులై | 2025 ◆ పేజీలు : 6

## జిల్లాలో ఆర్టిఐ అమలుపై రాష్ట్ర కమిషనర్ల పర్యటన

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 30, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలు పరిస్థితిని సమీక్షించేందుకు రాష్ట్ర ముఖ్య సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు, దేశాల భూపాల్ ,బోరెడ్డి అయోధ్య రెడ్డి జిల్లాలో రెండు రోజులు పాటు పర్యటన చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు రోజుల పర్యటనలో భాగంగా, జూలై 31 (గురువారం) ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు అన్ని శాఖల ప్రజా సమాచార

మిగతా 2 లో...



## ఉత్తమ విద్యతోనే... ఉన్నత స్థితి

గిరిజన విద్యార్థులకు అండగా ప్రభుత్వం ఉంది.. ఎమ్మెల్యే జారే

- ఐటీడీఏ తరపున గిరిజన చిన్నారులకు మంచి విద్య అందిస్తాం
- విద్యకు అత్యధిక ప్రాముఖ్యత ఇస్తున్నాం.... బి రాహుల్ ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి

**అశ్వారావుపేట జూలై 30, ప్రజాజ్యోతి:** గిరిజన విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకునేందుకు ఉత్తమంగా విద్యను అభ్యసించాలని, అందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. బుధవారం మండలంలోని కొండతోగు గ్రామంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ తో కలిసి ఆయన అక్కడ విద్యార్థులకు తాత్కాలికంగా అంగన్వాడీ పాఠశాలలో జిపిఎస్ పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

మిగతా 2 లో...





## మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్

**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 30, ప్రజా జ్యోతి:** పాల్వంచ మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామంలో గల మిషన్ భగీరథ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పరిశీలించి ప్రతి ఇంటికి నాణ్యమైన తాగునీరు చేరేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన ప్లాంట్ లో గ్రిడ్ నుండి నీటి ప్రవాహం, నీటి నిల్వ సామర్థ్యం, రోజువారి మండల డిమాండ్, గ్రామాల వారిగా నీటి సరఫరా స్థితిగతులను తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్లో వివిధ దశల్లో అమలవుతున్న నీటి శుద్ధి ప్రక్రియను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ప్రతి దశలో చేపడుతున్న పరీక్షలు, శుద్దీకరణ పద్ధతులు , ల్యాబ్ పరీక్షల ప్రమాణాలను గురించి అధికారులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ నిర్వహణలో ఉన్న సాంకేతిక పరికరాలు, ఫిల్టర్ల పనితీరు , కెమికల్ డోసింగ్ గురించి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో నీటి కాలుష్యం పెరుగుతుందని దానికి అనుగుణంగా, నీటి శుద్ధి పరీక్షలు నిర్వహించి

మిగతా 2 లో...



## జగన్నాథపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 30, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని జగన్నాధపురం గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలు ఓపీ, రిజిస్ట్రేషన్ కౌంటర్, ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డు, వ్యాక్సినేషన్ గదులను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో విధుల్లో ఉన్న మెడికల్ ఆఫీసర్ తో పాటు ఇతర సిబ్బంది హాజరును పరిశీలించి, విధి నిర్వహణ

మిగతా 2 లో...

## ఇందిరమ్మ ఇంటితో పేదల కల నెరవేరింది

ఇది ప్రజా ప్రభుత్వం మీ ఆకాంక్షల మేరకే పనిచేస్తుంది... ఎమ్మెల్యే జారే

- మండలంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



**అశ్వారావుపేట, జూలై 30, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలోని ఇందిరమ్మ ఇంటితో ప్రతి పేదవాడి కల నెరవేరుతుందని, ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజల ఆకాంక్షల మేరకే పనిచేస్తుందని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో

మిగతా 2 లో...

# జగన్నాధపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్





(మొదటి పేజీ తరువాయి...)

పట్ల అలసత్వం ప్రదర్శించకుండా ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులను పర్యవేక్షిస్తూ , వారికి అందుబాటులో ఉన్న మందుల గురించి తెలుసుకున్నారు. రోగులతో ప్రత్యక్షంగా మట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలు, వైద్యులు అందుబాటులో ఉంటున్నారా? మందులు ఇస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పట్ల అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది అని, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆసుపత్రి సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధుల్లో నిబద్ధత చూపాలని ఆదేశించారు. అన్ని రకాల అవసరమైన మందులు, వ్యాక్సిన్లు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా స్టాక్ పూర్తయ్యేలోపే ముందుగానే ఇండెంట్ చేసి తెప్పించుకోవాలని సూచించారు. ఎక్స్ పైర్ అయ్యే ఔషధాలపై అప్రమత్తంగా ఉండాలని, అవి ఆసుపత్రిలో నిల్వ ఉంచరాదన్నారు, ప్రత్యేకంగా వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ, వైరల్ ఫీవర్ల చికిత్సకు అవసరమైన మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని సూచించారు. గర్భిణీల వివరాలు నిబంధనల ప్రకారం ఆన్లైన్ లో నమోదు చేయాలని ఆదేశించారు.అంతేకాకుండా, ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట డాక్టర్ రాజు, సిబ్బంది , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యతోనే.. ఉన్నత స్థితి





(మొదటి పేజీ తరువాయి...)

ఈ గ్రామంలోని చిన్నారులు అడివి మార్గాన వాగు దాటి పాఠశాలకు వెళ్లి విద్యనభ్యసిస్తున్నారని నా దృష్టికి వచ్చిందని వెంటనే ఐటిడిఏ పిఓ రాహుల్ కు సమాచారం అందించి కొత్త బిల్డింగ్ కట్టే వరకు తాత్కాలికంగా పాఠశాల ఏర్పాటు చేయాల్సిందిగా సూచించానన్నారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు తల్లిదండ్రులు కూడా పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలన్నారు

**విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం... బి. రాహుల్ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి**

గిరిజన విద్యార్థులు చదువుకునేందుకు ఐటిడిఏ తరఫున అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పాఠశాలలో ఉపాధ్యాయులు అవసరమైన ప్రతిచోట వెంటనే నియమిస్తున్నామన్నారు. చదువు అనేది భవిష్యత్తుకు మంచి పునాది వేస్తుందని గిరిజనుల పిల్లలు ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఐటిడిఏ పరిధిలో నడుస్తున్న అన్ని పాఠశాలలో గిరిజన పిల్లలు అర్థం చేసుకోవడానికి చిన్న పిల్లలకు ఉద్దీపకం ,పెద్దవారికి కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని దీని ద్వారా విద్యార్థిని విద్యార్థులకు అవగాహన వస్తుందన్నారు. కొండ తోపు గ్రామంలో సుమారు 25 మంది గిరిజన విద్యార్థులు అడవి మార్గాన ఎంపీపీ స్కూల్ కు వెళుతున్నట్లు తెలిసిందని మధ్యలో వాగు ఉండడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు తెలపడంతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ ఫోన్ ద్వారా తనకు తెలిపారని వెంటనే ఇదే గ్రామంలో పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి మణెమ్మ ,ఎసిఎంఓ రమేష్ ,ఏటీడీవో చంద్రమోహన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



(మొదటి పేజీ తరువాయి...)

పరిశుభ్రమైన నీరు సరఫరా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. వాటర్ ఫిల్టర్ బెడ్ భవనం పైన సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వాటర్ ప్లాంట్ ఆవరణంలో ఖాళీ ప్రదేశం అధికంగా ఉన్నందున ఆదాయాన్ని చేకూర్చే మొక్కలను నాటాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ నలిని, పాల్వంచ తాసిల్దార్ ధారా ప్రసాద్, మిషన్ భగీరథ గ్రిడ్ డి ఈ సాయి, ఏఈ వెంకటేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఆర్టిఐ అమలుపై రాష్ట్ర కమిషనర్ల పర్యటన

(మొదటి పేజీ తరువాయి...)

అధికారులు పి ఐ ఓ లు , అప్పిలేట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించబడుతుందని, అదేవిధంగా మధ్యాహ్నం 3:గంటల నుండి సాయంత్రం 5:గంటల వరకు అప్పీలు దారుల తో విచారణ ఉంటుందని కలెక్టర్ తెలిపారు, ఆగస్టు 1 (శుక్రవారం) ఉదయం 11: గంటల నుండి మధ్యాహ్నం 2:గంటల వరకు మరో విడత ఆర్టీఐ అప్పీల్ విచారణలు జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించబడతాయని తెలిపారు, ఈ సందర్భంగా, అన్ని శాఖల పి ఐ ఓ లు ,అప్పిలేట్ అధికారులు 6(1) కింద దాఖలైన ఆర్టీఐ దరఖాస్తుల రసీదులు, ప్రశ్నలు, సమాధానాలు, అవసరమైన పాయింట్ వారీ కౌంటర్ సమాచారంతో విచారణలకు తప్పకుండా హాజరుకావలసినదిగా కలెక్టర్ ఆదేశించారు. అన్ని విభాగాల పి ఐ ఓలు ,ఏ ఏ లు ఇంటరాక్షన్ సెషన్ కు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. సమాచార హక్కు చట్టం అమలులో పారదర్శకత పెంపొందించడంలో భాగంగా, ప్రతి కార్యాలయంలో ఆర్టీఐ బోర్డులను మార్గదర్శకాల ప్రకారం నవీకరించి, ప్రదర్శించాలనీ, ఇందుకు తగిన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## సబ్ జైల్ ను సందర్శించిన జడ్జి





**ఇల్లందు, జులై 30, ప్రజాజ్యోతి:** ఇల్లందు సబ్ జైల్ ను బుధవారం ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి సందర్శించారు. ముందుగా పలు రికార్డులను పరిశీలించారు. ఖైదీలకు మెనూ ప్రకారం సదుపాయాలు అందుతున్నాయో లేవో వారిని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఫ్రీ లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ సూపరిండెంట్ ఎన్. చంద్రశేఖర్, హెడ్ వార్డెన్ భుజరంగరాజు, సబ్ జైల్ సిబ్బంది కె. శ్రీనివాస్, భాస్కర్, లీగల్ ఎయిడ్ న్యాయవాది కీర్తి కార్తీక్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


## ఇందిరమ్మ ఇంటితో పేదల కల నెరవేరింది



(మొదటి పేజీ తరువాయి...)

ఇందిరమ్మ లబ్ధిదారులకు హక్కు పట్టాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు పట్టా అందుతుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతుందని అందుకు అనుగుణంగా పనిచేస్తున్నామన్నారు. మండలంలో ఎమ్మెల్యే జారే విస్తృతంగా పర్యటించారు ముందుగా మామిళ్ళవారిగూడెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల ఆర్థిక చేయూతతో నిర్మించిన పాఠశాల గ్రంధాలయాన్ని ప్రారంభించి ఉపాధ్యాయులు అభినందించారు. తాను ప్రవేశపెట్టిన నేను సైతం విద్యాభివృద్ధికి చేయూత కార్యక్రమంలో భాగస్వామ్యం తమ సొంత గ్రామాలలోని పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థులకు అవసరమైన విద్యా సామాగ్రి అందే విధంగా సహాయం అందించాలన్నారు. నియోజకవర్గ కేంద్రంలో ఆకాంక్షిత జిల్లా కార్యక్రమం లో స్వయం సహాయక సంఘం మహిళల తయారుచేయబడిన ఉత్పత్తుల ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తుమ్మ రాంబాబు, నియోజకవర్గ నాయకులు జూపల్లి రమేష్, సుంకవల్లి వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ గురుకుల( మహిళ ) కళాశాలలో ఖాళీల భర్తీకి ఆహ్వానం : కళాశాల ప్రిన్సిపల్



**కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 30, ప్రజాజ్యోతి:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల( మహిళా ) కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరానికి ఖాళీ సీట్ల భర్తీకి జూలై 31న స్పాట్ అడ్మిషన్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ మైథిలి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల, జనన, ఆదాయ, ఎస్ ఎస్ సి మార్కుల మెమో, ఆధార్ ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు పాస్పోర్ట్ సైజ్ ఫొటోస్ వెంట తీసుకురావాలన్నారు. అదేరోజు జాబితా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు కళాశాలలో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మౌళిక వసతులు ఏర్పాటు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

- పాల్వంచ సొసైటీ అధ్యక్షులు రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 30, ప్రజా జ్యోతి:** అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు మౌళిక వసతులు ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని పాల్వంచకో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పాల్వంచ మండలం పరిధి లోని జగన్నాధపురం గ్రామంలో గల పంచాయతీ కార్యాలయం వద్ద పీసా గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న కొత్వాల మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వారికీ అవసరమైన నీరు,రోడ్డు, డ్రైన్లు విద్యుత్, వైద్యం వంటి మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు,

ఏ_4 మద్యం షాపు నిర్వహణకు ఆమోదం

పీసా గ్రామసభలో జగన్నాధపురం లోని ఏ-4 మద్యం షాపు నిర్వహణకు గ్రామస్తులు ఆమోదం తెలిపారు.

ఈ కార్యక్రమంలో పెద్దమ్మ గుడి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు,పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ బి నారాయణ, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు, పీసా కమిటీ సభ్యులు ధర్మసోత్ రమేష్, బానోత్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, మాజీ జడ్పిటిసి మాలోత్ నందా నాయక్, కాంగ్రెస్ నాయకులు కొండం పుల్లయ్య, బండ్లపల్లి వెంకట నారాయణ, కందుకూరి రాము, పైడిపల్లి మహేష్, ఉండేటి శాంతి వర్దన్, అలెక్స్, ధర్మసోత్ సేవియా, బానోతు బాలాజీ నాయక్, మలోత్ లోక్య,బాబు రావు, వెంకటేష్, చింటూ, బిచ్చ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ విద్యాలయంలో వైద్య శిబిరం



**టేకులపల్లి,జూలై30,ప్రజాజ్యోతి:** మండలలోని కస్తూర్బా గాంధి విద్యాలయంలో మండల వైద్యాధికారి కందుల దినేష్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించి 26 మంది బాలికలకు చికిత్సను అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత సీజనల్ వ్యాధులు రక్తహీనతపై అవగాహన కల్పించారు.ఎట్టి పరిస్థితుల్లో ఒకరి వస్తువులు మరొకరు ఉపయోగించరాదని ప్రతి ఒక్కరికి రోజు విడిచి రోజు వాడుకోవడానికి విధిగా రెండు టవల్స్,రెండు పిల్లో కవర్స్ ఉండాలని తడిగా ఉన్న బట్టలు ధరించరాదని తెలిపారు.ఎలర్జీ లక్షణాలు ఉన్నపిల్లల బట్టలను డెటాల్ కలిపిన నీటిలో 15 నిమిషాలు ఉంచి బాగా ఎండిన తర్వాత వాడుకోవాలని సూచించారు ముఖ్యంగా బాలికల్లో రక్తహీనత ఎక్కువగా ఉందని, రక్తహీనత వల్ల పిల్లలో చురుకుదనం లేకపోవడం మగతగా ఉండడం త్వరగా అలసిపోవడం ఆయాసపడడం త్వరగా వ్యాధుల బారిన పడటం,చదువు ఆటల్లో వెనుకబడిపోవడం వంటివి ఉంటాయని దీనిని నివారించడానికి ఇనుప దాతువు ఉన్న ఆహార పదార్థాలను విరివిగా తీసుకోవడంతోపాటు ప్రతీ గురువారం ప్రతీ బాలికకి ఒక ఐరన్ పోలిక్ యాసిడ్ టాబ్లెట్ మింగించాలని వైద్య సిబ్బందికి ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణా అధికారి దేవా, సూపర్వైజర్ గుజ్జా విజయ, ఏఎన్ఎంలు సులోచన, చంద్రకళ ప్రిన్సిపల్ సంతు, సీతాదేవి ఉపాధ్యాయ సిబ్బంది ,ఆశా కార్యకర్తలు మజహరి ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీలలో మాస్టర్ మైండ్స్ విద్యార్థుల ప్రతిభ





**ఇల్లందు, జులై 30, ప్రజాజ్యోతి:** ఇల్లందు డివిజన్ స్థాయి ప్రైవేట్ స్కూల్స్ ఆధ్వర్యంలో జరిగిన వ్యాసరచన (ఎఫెక్ట్ అఫ్ డ్రగ్స్ ఆన్ స్టూడెంట్స్) పోటీలలో నెంబర్ 2 బస్తీ మాస్టర్ మైండ్స్ స్కూల్ విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ టాప్ 10 స్థానాల్లో 3 బహుమతులను గెలుచుకోవడం సంతోషకరమన్నారు. విద్యార్థులను యంఈఓ ఉమాశంకర్, మున్సిపల్ మాజీ చైర్మన్, ట్రస్మా రాష్ట్ర నాయకుడు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ప్రైవేట్ స్కూల్స్ జిల్లా అధ్యక్షులు కాంతారావు, ట్రస్మా జిల్లా నాయకులు తుమ్మలపల్లి ప్రసాద్, ప్రిన్సిపాల్ రామకృష్ణలు అభినందించారు.

## చెరువులు, కుంటలకు సీతారామ సాగునీటిని మళ్లించి రైతుల పంటలకు అందించాలి

- -సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు



**బూర్గంపహాడ్, జూలై 30 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండలంలోని చెరువులు, కుంటలకు సీతారామ సాగునీటిని మళ్లించి ఆ సాగునీరు రైతుల పంటలకు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కృష్ణసాగర్ పంచాయతీలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు పర్యటించగా అక్కడి రైతులు పంటలు పండించుకోవాలంటే సీతారామ సాగునీరు గ్రామాల్లోని చెరువులు, కుంటలకు లిఫ్ట్ ద్వారా అందిస్తే పంటలకు ఎలాంటి డోకా ఉండదని చెబుతున్నారన్నారు. సీతారామ నీటిని జిల్లాలోని రైతులకు కాకుండా ఇతర జిల్లాకు తరలిస్తే చూస్తూ ఊరుకోబోమని, ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించనతర్వాతే సీతారామ నీళ్లు ఇతర జిల్లాకు వెళ్లాలని, అలాకాని పక్షంలో రైతుల తరపున సీపీఎం పోరాడుతుందన్నారు. అదేవిధంగా కృష్ణసాగర్ పంచాయతీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని రోడ్లు సరిగా లేవని, ఎస్టీ కాలనీ నుంచి బత్తులనగర్కు వెళ్లే రహదారి చాలా దారుణంగా ఉందని, దోసపాడు వెళ్లే రోడ్డు సైతం గుంతలతో ఉందన్నారు. ఈ సమస్యలను స్థానిక అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొడెం వెంకటేశ్వర్లు, గుండి వీరాస్వామి, సోడె వెంకటేశ్వర్లు, తాటి శ్రీను, కారం అజాద్, తాటి చంటి, కోండ్రు కిరణ్ పాల్గొన్నారు.

## మౌలానా ఆజాద్ యూనివర్సిటీ లో సివిల్స్ కు ఉచిత శిక్షణ

- మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు అవకాశం
- మైనార్టీ జిల్లా అధ్య క్షులు ఎండీ యాకూబ్ పాషా



**కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 30, ప్రజాజ్యోతి:** కేంద్ర ప్రభుత్వ పరిధిలోని గల మౌలానా ఆజాద్ యూనివర్సిటీ హైదరాబాద్ వారు అందిస్తున్న ఉచిత సివిల్ సర్వీస్ కోచింగ్ ను సద్వినియోగం చేసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయికి ధీటుగా జాతీయ స్థాయిలో సివిల్స్ కు ఒక ఏడాది పాటు ఉచిత భోజనం వసతితో పాటు శిక్షణను యూనివర్సిటీ అందిస్తోందని తెలిపారు, ఈ యొక్క శిక్షణ మైనార్టీలతో పాటు ఎస్సీ, ఎస్టీలతో పాటు మహిళలకు కూడా అందించడం జరుగుతుందన్నారు, ఆసక్తి గల అభ్యర్థులు 10 వ తరగతి సర్టిఫికేట్, డిగ్రీ సర్టిఫికేట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో అగస్టు 5వ తేదీ వరకు తమ వివరాలను https://manuu.gleamappstore.com నందు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ ఉచిత శిక్షణ పొందేందుకు గాను విశ్వవిద్యాలయం వారు నిర్వహించే ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ , అన్ని వర్గాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇతర సమాచారం కొరకు 8520860785 నంబర్ కు సంప్రదించాలన్నారు.

## విష జ్వరాలు ప్రబలకుండా హెల్త్ క్యాంపులను సంక్షేమ హాస్టల్లో ఏర్పాటు చేయాలి

- సంక్షేమ హాస్టల్లో శాశ్వత ఏఎన్ఎం లను తక్షణమే నియమించాలి
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 30, ప్రజా జ్యోతి:** వర్షాకాలం ప్రారంభమైనందున జిల్లావ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాలలో విష జ్వరాలు అంటువ్యాధులు ప్రబలకుండా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక చంద్ర రాజేశ్వరావు భవన్ లో ఏఐఎస్ఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలు వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సంక్షేమ హాస్టల్లో తక్షణమే అత్యవసర పారిశుద్ధ్య పనులు చేపట్టి విద్యార్థులకు విష జ్వరాలు అంటువ్యాధులు ప్రబలకుండా సంక్షేమ శాఖ అధికారులు హెల్త్ క్యాంపులు నిర్వహించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. జిల్లావ్యాప్తంగా ఎస్టి సంక్షేమ వసతి గృహాల్లో మాత్రమే ఏఎన్ఎంలు ఉన్నారని, ఎస్సీ బీసీ ఆశ్రమ గురుకుల వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం నియమించాలని డిమాండ్ చేశారు. డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ లాంటి జ్వరాల బారిన పడకుండా విద్యార్థులకు రక్షణగా దోమతెరలు అందించాలని సంక్షేమ శాఖ ఉన్నత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్, జిల్లా సమితి సభ్యులు రాజకమల్, లాల్ పాషా, రామకృష్ణ, శ్రీకాంత్, అభిలాష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 5న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

- ఉపాధ్యాయులహక్కులసాదన కోసం ఆందోళనలే శరణ్యం -ఉద్యమమే మార్గం టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ.రాంబాబు



**ఆళ్ళపల్లి. జులై30.ప్రజాజ్యోతి:** ఆళ్లపల్లి మండల కేంద్రంలో టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ. రాంబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటి (యు ఎస్ పి సి) ఆధ్వర్యంలో ఆగస్టు 5న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. విద్యారంగం సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరేరు.

# ప్రేమజంటను బ్లాకమెయిల్ చేసిన లాడ్జి నిర్వాహకులు

- -పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

**భద్రాచలం టౌన్ జూలై 30(ప్రజాజ్యోతి)** భద్రాచలం పుణ్యక్షేత్రంలో ఓ లాడ్జిలో ప్రేమజంట్ గది అద్దెకు తీసుకుని ఉండగా వారిని సీసీ కెమెరా ద్వారా వీడియో తీసి బ్లాక్ మెయిల్కు పాల్పడిన సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భద్రాచలంలోని ఓ లాడ్జిని ప్రేమజంట గతంలో అద్దెకు తీసుకుంది. అయితే చెకవుట్ చేసి వెళ్లిన తర్వాత కొన్ని రోజులకు లాడ్జీ నిర్వాహకులు ముందుగా వేసిన పథకం ప్రకారం ఆ ప్రేమజంట గదిలో ఉండగా సీసీ కెమెరా ద్వారా వీడియోలు తీసి ఆ వీడియోలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తామని ఫోన్ ద్వారా బ్లాక్ మెయిల్కు పాల్పడ్డారు. ఈ విషయంలో ప్రేమజంట ఆ లాడ్జీ నిర్వాహకులను బతిమాలుకుని కొంత మొత్తాన్ని చెల్లించారు. అయితే మరోసారి బ్లాక్ మెయిల్ చేయడంతో ఆ ప్రేమజంట చేసేది లేక భద్రాచలం పోలీసులను బుధవారం ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు



**భద్రాచలం టౌన్,జూలై 30 (ప్రజాజ్యోతి)** భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్రావు బుధవారం దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహించగా అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయంలోని ఉప ఆలయాలైన లక్ష్మీతాయారు, అభయాంజనేయస్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ విశిష్టతను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులతో పాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం



**భద్రాచలం, టౌన్,జూలై 30(ప్రజాజ్యోతి):** భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో సీతారాముల నిత్యకల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న జంటలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

# ఎన్ఐటిఐ అయోగ్ ఆకాంక్ష మేళ

- -స్థానిక ఉత్పత్తుల ప్రోత్సాహం




**ఇల్లందు, జులై 30, ప్రజాజ్యోతి:** సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సుదిమళ్ల రైతు వేదికలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, మహిళా సంఘాల ఉత్పత్తులను స్టాల్స్ రూపంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ విద్యా చందన మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి, నైపుణ్యాలను ప్రోత్సహించడానికి ఎన్ఐటిఐ అయోగ్ చేపట్టిన ఒక వినూత్న కార్యక్రమం ఆకాంక్ష మేళ అన్నారు. ఆకాంక్ష మేళ' అనేది ఎన్ఐటిఐ అయోగ్ యొక్క ఆకాంక్ష' బ్రాండ్ క్రింద ప్రారంభించబడిన దేశవ్యాప్త కార్యక్రమమని పేర్కొన్నారు. ఆకాంక్ష జిల్లా, మండలాల నుండి వచ్చే స్థానిక ఉత్పత్తులు, చేతివృత్తుల ఉత్పత్తులు, స్వయం సహాయక బృందాలు (ఎస్హెచ్జి), రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్పిఓ) తయారుచేసిన వస్తువులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం కోసం స్థానిక ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలను కల్పించడం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఆర్థిక కార్యకలాపాలను పెంచనున్నట్లు తెలిపారు. చేతివృత్తులు, కళలు, స్థానిక నైపుణ్యాలకు తగిన గుర్తింపు, ఆదాయాన్ని అందించడం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. స్వయం సహాయక బృందాలు, చిన్న, సన్నకారు రైతులు, చేతివృత్తుల వారికి తమ ఉత్పత్తులను విస్తృత మార్కెట్‌కు తీసుకెళ్లే అవకాశం కల్పించడం జరుగుతుందని, తద్వారా వారి జీవనోపాధిని మెరుగుపరచనున్నట్లు తెలిపారు. స్థానిక ఉత్పత్తుల నాణ్యత, ప్రత్యేకతను ప్రజలకు తెలియజేసి వాటిని కొనుగోలు చేయమని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఽఆకాంక్ష హాట్ లో అనేక రకాల స్థానిక ఉత్పత్తులు ప్రదర్శించబడతాయని, వీటిలో సాంప్రదాయ చేతివృత్తులు, కళాఖండాలు, స్థానిక సంస్కృతి, నైపుణ్యాన్ని ప్రతిబింబించే వస్తువులని, స్థానిక నేత కార్మికులు తయారు చేసిన దుస్తులు, గృహోపకరణాలు ఉంటాయని తెలిపారు. ఆకాంక్ష జిల్లాలలో పండించిన సేంద్రీయ కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, ఆయా ప్రాంతాలకు ప్రత్యేకమైన ఆహార పదార్థాలు, స్వీట్లు, స్నాక్స్, స్థానిక అటవీ ఉత్పత్తుల నుండి తయారైన ఔషధాలు, సౌందర్య సాధనాలు, గిరిజనులు సేకరించిన లేదా తయారు చేసిన వస్తువులు, పప్పులు, సుగంధ ద్రవ్యాలు, నూనెలు వంటి ప్రాసెస్ చేయబడిన వ్యవసాయ ఉత్పత్తులు ప్రదర్శించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ మేళ ద్వారా స్థానిక చేతివృత్తుల వారు, స్వయం సహాయక బృందాలు, చిన్న వ్యాపారవేత్తలు తమ ఉత్పత్తులను విస్తృత ప్రేక్షకులకు ప్రదర్శించడానికి, నేరుగా వినియోగదారులతో సంభాషించడానికి, వారి ఉత్పత్తులకు సరైన ధర పొందడానికి ఒక వేదిక లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, ఎంపీడీఓ దన్ సింగ్, ఏఓ సతీష్, డిపియం సమ్మక్క, డిసిసిబి డైరెక్టర్ కోటేశ్వరరావు, మండల మహిళా సమైక్యలు టేకులపల్లి, ఇల్లందు అధ్యక్షురాలు తోలం శారద, అనిత, ఇల్లందు, టేకులపల్లి ఏపిఎంలు దుర్గారావు, రవికుమార్, సిబ్బంది, నరసింహారావు, సంపత్, స్వర్ణలత, నాగేంద్ర, సునీల్, రామ్మూర్తి, సావిత్రమ్మ, నాగమణి, శ్రీలత, కొమ్మాలు, సీఎస్పిలు నరేష్ కుమార్, గంగాధర్, గ్రామ సంఘ సహాయకులు చందర్, పాపారావు, ప్రమీల, ఉమారాణి, గ్రామ సంఘాల సంఘ మహిళలు పాల్గొన్నారు.

# ముంపు ముంచుకొస్తున్నా మేల్కొనని కాంగ్రెస్ పాలకులు

- - రామయ్యను ముంచుతూ దొంగ దండాలు పెడుతున్న బిజెపి నాయకులు
- - కుప్పకూలిన రిటర్నింగ్ వాల్ ని సందర్శించే తీరికలేని ప్రజాప్రతినిధులు
- - ముంపు పై స్పందించకుంటే కాంగ్రెస్ బిజెపి పార్టీలకు గుణపాఠం తప్పదు
- సిపిఐఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు





**భద్రాచలం టౌన్, జూలై 30(ప్రజాజ్యోతి)** ఓవైపు ముంపు ముంచుకొస్తున్నా కాంగ్రెస్ పాలకులు మేల్కోనకుండా మీనమేషాలు లెక్క పెట్టడం సరైనది కాదని పోలవరం ప్రాజెక్టుతో భద్రాచలానికి వచ్చే ముంపుపై అఖిలపక్షాన్ని కలుపుకొని కార్యచరణ రూపొందించాలని, ఓవైపు భద్రాద్రి రామయ్యను ముంచుతూ మరోవైపు దొంగ దండాలు పెడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ముందు ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపి రామయ్య భూములకు శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఐఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు హితవు పలికారు. బుధవారం సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కరకట్టరక్షణ,పోలవరం ముంపు అధ్యయన యాత్రలో మచ్చ వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. కరకట్ట రక్షణ గోడ కూలి నెలరోజులవుతున్న తాజా మాజీ ఎమ్మెల్యేలు గాని ఎంపీ మంత్రులు గాని సందర్శించ కుండా పదవుల కోసం కొట్టుకోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. పట్టణంలోని శివారు కాలనీలకు ముంపు ప్రమాదం ముంచుకొస్తున్న స్పందన లేని ప్రజాప్రతినిధులు మనకు అవసరమా అని ప్రశ్నించారు.

## ఓవైపు ముంచుతూ మరోవైపు దొంగ దండాలు పెడుతున్న బిజెపి నాయకులు

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఓవైపు పోలవరంతో భద్రాద్రి రామయ్యను ముంచుతూ మరోవైపు దొంగ దండాలు పెడుతూ మోసకారి పర్యటన మానుకోవాలని హెచ్చరించారు. ఐదు పంచాయతీలను భద్రాచలంలో కలపడం ద్వారా రామయ్య భూములకు శాశ్వత పరిష్కారం దక్కుతుందన్న విషయం తెలిసినప్పటికీ విభజన పేరుతో చిచ్చురేపి ఇప్పుడు రామయ్య భూములపై బిజెపి రాష్ట్రఅధ్యక్షులు మొసలి కన్నీరు కార్చితే ఇక్కడ ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. పోలవరం బ్యాక్ వాటర్ తో భద్రాచలానికి కలిగే ముంపుకి కాంగ్రెస్, బిజెపి పార్టీలే బాధ్యత వహించాలని కరకట్ట పునర్ నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఆయా పార్టీలకు ఇక్కడి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రంలో 9 ఏళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ సైతం భద్రాచలానికి తీవ్ర అన్యాయం చేసిందని కరకట్ట నిర్మాణానికి 2000 కోట్ల నిధులు కేటాయిస్తామని కెసిఆర్ ఇక్కడ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. భద్రాద్రి రామయ్య తో పాటు ఇక్కడ ప్రజలను ముంచే పాపం కాంగ్రెస్ బిజెపి టిఆర్ఎస్ పార్టీలకు తప్పక తగులుతుందని మచ్చ స్పష్టం చేశారు. సిపిఐ ఎం ఆధ్వర్యంలో ముంపు అధ్యయన యాత్ర పేరుతో కుప్పకూలిన రక్షణ గోడ నుండి సుభాష్ నగర్ ప్రాంతం వరకు పర్యటన నిర్వహించి లోతట్టు ప్రాంత ప్రజలతో మమేకమై వారి సమస్యలను చర్చించామని అన్నారు. వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కరకట్ట పునర్ నిర్మాణ పనులు చేపట్టకపోతే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని సుభాష్ నగర్ కాలనీ వద్ద నిర్మిస్తున్న కరకట్ట పనులు వేగవంతంగా పూర్తి చేయాలని లేని పక్షంలో ఆగస్టులో గోదావరి వరద రూపంలో పెనుప్రమాదం సంభవించే అవకాశం ఉందని దానికి కాంగ్రెస్ బిజెపి పాలకులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ అధ్యయన యాత్ర ప్రారంభ సభకు పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షత వహించగా రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట రామారావు పారిల్లి సంతోష్ కుమార్ డి సీతాలక్ష్మి పట్టణ కమిటీ సభ్యులు నాదెండ్ల లీలావతి, ఉస్తేల జ్యోతి, బెల్లంకొండ కుసుమ, నకిరేకంటి నాగరాజు, ధనకొండ రాఘవయ్య, జీవనజ్యోతి,చాట్ల శ్రీనివాసరావు అజయ్ కుమార్, కుంజా శ్రీనివాస్,సంద్ర భూపేంద్ర, డివైఎఫ్ఐ అధ్యక్షులు దారిశెట్టి సతీష్‌బాబు, మాజీ డివైఎఫ్ఐ నాయకులు అన్నం వెంకట్ యాత్రకు సంఘీభావం తెలిపారు. శాఖ కార్యదర్శులు గోవర్ధన్ ఝాన్సీ, డి రామ క ృష్ణ, పుణ్యావ తి, ర మ ణ నాయకులు నాగలక్ష్మి,వెంకట్ చక్రి సూరమ్మ గణపతమ్మ ఎస్ఎఫ్ఐ నాయకులు రవీంద్ర పాల్గొన్నారు...

# విద్యారంగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి :: యుఎస్పిసి



**భద్రాచలం టౌన్, జూలై 30(ప్రజాజ్యోతి):** సమస్యలతో సతమతమవుతున్న ఉపాధ్యాయులు తమ విధినిర్వహణలను సమర్థవంతంగా నిర వ్వర్తించ లేక పోతున్నార ని, విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు సంపూర్ణంగా పరిష్కరించి విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో 25 శాతం నిధులు కేటాయించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకులు బి.రాజు, జిల్లా నాయకులు ఎస్.విజయకుమార్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ చేపట్టిన ఉద్యమ కార్యచరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆగష్టు 5న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు చేపట్టిన ధర్నాను విజయవంతం చేయడానికి సన్నాహక సమావేశాన్ని టీఎస్ యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ప్రజాపాలన అందిస్తామని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని నినాదాలతో పాటుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలపై తమ ఎన్నికల మేనిఫెస్టోలో అనేక హామీలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 19 నెలలు గడచినప్పటికి దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ముఖ్యమైన అనేక సమస్యలను పరిష్కరించడంలో మాత్రం తీవ్ర జాప్యాన్ని ప్రదర్శిస్తూ మీనమేషాలు లెక్కిస్తున్నదని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకులు బి.రాజు, జిల్లా నాయకులు ఎస్.విజయ్ కుమార్ లు అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివక్షకు గురైన విద్యా రంగం, ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశించడం జరిగిందని, అందుకు భిన్నంగా గత పాలకులు ప్రతి ఏటా విద్యారంగానికి నిధుల కేటాయింపులను కుదిస్తూ విద్యారంగాన్ని ఉద్దేశపూర్వకంగా పూర్తిగా విధ్వంసానికి గురిచేసిందని, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పిందని, కొన్ని సంఘాలను అనుయాయులుగా మార్చుకున్నదని, గత ప్రభుత్వం అనుసరించిన విధానాల రూపం మార్చి ప్రస్తుత పాలకులు అమలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని 206 సంఘాలతో ఏర్పడిన తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ ఉద్యమ కార్యాచరణ ప్రకటించగానే మంత్రుల, అధికారుల కమిటీలను వేయడం, చర్చల పేరుతో కాలం గడపడం, ప్రతినెలా పెండింగ్ బిల్లుల చెల్లింపులకు 700 కోట్ల రూపాయలు విడుదల చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పడం లాంటి ప్రభుత్వ విధానాల వలన ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పోరాట కార్యాచరణను ప్రకటించిందని వారన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, గిరిజన సంక్షేమ, మోడల్ స్కూల్స్ కేజీబీవీ, గురుకుల పాఠశాలల సమస్యలతో పాటుగా ఆయా విద్యా సంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సుమారు 30 సమస్యలతో మూడు దశల పోరాట కార్యక్రమాన్ని యుఎస్పిసి చేపట్టిందని, మొదటి దశ మండలంలోని తహసిల్దార్లకు మెమోరాండం సమర్పించడం జరిగిందని, రెండో దశ రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో గల కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన నిర్వహించి కలెక్టర్లకు వినతి పత్రాన్ని సమర్పించడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రామాచారి, టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు కె.శ్రీనివాసరావు టిపిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బి.ప్రకాష్ రావు, టీఎస్ యుటిఎఫ్ దుమ్ముగూడెం మండల అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు టిపిటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎ.రామచంద్, టీఎస్ యుటిఎఫ్ టిపిటిఎఫ్ వివిధ మండలాల బాధ్యులు కె.సైదులు ఆర్.భాష్య, బి.రఘునందన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ ప్రైవేటు స్కూల్స్ లో శేషు కుమార్ సేవలు అమోఘం

- -విద్యా శిఖరం శేషన్న కు ఇల్లెందులో ఘనంగా నివాళులు
- -వ్యాస రచన పోటీ విజేతలకు బహుమతుల అందజేత



**ఇల్లెందు, జులై 30, ప్రజాజ్యోతి:** మూడు సంవత్సరాల క్రితం రాష్ట్రంలో ఒక విద్యా శిఖరం నేలకొరికిందని, ఆ విద్యా శిఖరం సేవలు ఇప్పటికీ అనేక మందికి ఉపయోగ పడుతున్నాయని పలువురు వక్తలు కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సూరపనేని శేషు కుమార్ గత మూడు సంవత్సరాల క్రితం గుండె పోటుతో మరణించారు. ఆయన మూడవ వర్ధంతి సభ బుధవారం ఇల్లెందు ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ఎంఇఓ ఉమా శంకర్, టిపిజెఎంఏ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం వీరారెడ్డి, ట్రస్మా ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుర్రం కాంతారావు లు మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా బడ్జెట్ పాఠశాలలు నాణ్యమైన విద్యను అందిస్తూ సేవా దృక్పథంతో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదే సందర్భంలో బడ్జెట్ పాఠశాలలకు ఏమైనా సమస్యలు ఉంటే శేషు కుమార్ ఎంతో నేర్పుతో ఆ సమస్యలను పరిష్కరించేవాడని గుర్తు చేశారు. ఇల్లెందు పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు శేషు కుమార్ స్మారకార్థం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ట్రస్మా రాష్ట్ర నాయకులు తుమ్మలపల్లి ప్రసాద్, నామా సుధాకర్, డివిజన్ అధ్యక్షుడు కె. వెంకటస్వామి, మార్గదర్శిని హైస్కూల్ డైరెక్టర్స్ యాదగిరి రాంబాబు, అర్వపల్లి రాధాకృష్ణ, మాస్టర్ మైండ్ హైస్కూల్ కరస్పాండెంట్ సర్వేశ్వరరావు, కాకతీయ హైస్కూల్ కరస్పాండెంట్ డి. రాంచందర్, ఎంఆర్జి నారాయణ హైస్కూల్ కరస్పాండెంట్ ఒంగూరి శ్రీనివాసరావు, భారత్ స్కూల్ కరస్పాండెంట్ మోహన్ రావు, స్వాతి స్కూల్ కరస్పాండెంట్ రామకృష్ణ, అరుణోదయ స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బోనమెత్తిన బేతంపూడి

**టేకులపల్లి, జూలై30, ప్రజాజ్యోతి :** మండలంలోని బేతంపూడి గ్రామంలో బోనాల పండుగ నిర్వహించారు. గ్రామదేవతలకు నైవేద్యాలు వండి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి బోనాలు ఎత్తుకొని డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు పూనకాలతో నృత్యాలు చేశారు. ఆడపడుచులు బోనాలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువత మహిళలు పాల్గొన్నారు.



## 11 కిలోల గంజాయి పట్టివేత



**భద్రాచలం టౌన్, జూలై 30(ప్రజాజ్యోతి)** భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డు ఆర్టీఏ కార్యాలయం వద్ద ఎస్సై శ్రీహరి సిబ్బందితో బుధవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్రవాహనం అనుమానాస్పదంగా కనిపించడంతో వాహనం ఆపి తనిఖీ చేయగా 11.700 కిలోల ఎండుగంజాయి ఉన్నట్లు గుర్తించి విచారించారు. ఒరిస్సాకు చెందిన కమల్ బిస్వాస్ అపాచీ బైక్పై గంజాయిని హైదరాబాద్కు తరలిస్తున్నట్లు తెలపగా ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని గంజాయి, వాహనాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం ఎక్సైజ్ స్టేషన్కు సొత్తును తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ వాహన తనిఖీల్లో సిబ్బంది సుధీర్, వెంకట్, హరీష్, హనుమంతరావు, ఉపేందర్ పాల్గొన్నారు.

## సేవలాల్ యువసేన తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా-బానోత్ ప్రతాప్ నాయక్



**పాల్వంచ(రూరల్), జూలై 30, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణ కేంద్రంలో జరిగిన సేవలాల్ సేన రాష్ట్రస్థాయి సమావేశంలో జగ్గుతండ గ్రామం, పాల్వంచ మండలంకు చెందిన బానోత్ ప్రతాప్ నాయక్ ని సేవాలాల్ యువసేన తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సేవలాల్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు భానోత్ హుస్సేన్ నాయక్ నియామక పత్రాన్ని అందజేసి, సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడవాలని, గిరిజన చట్టాలపై అవగాహన కల్పించి నిత్యం గిరిజన ప్రజల మధ్య ఉండి గిరిజన జాతి కోసం పోరాటం చేయాలని దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమం నందు రాష్ట్ర స్థాయి నాయకులు విద్యార్థి సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంగోత్ నగేష్, ధర్మ జాగరణ రాష్ట్ర అధ్యక్షులు మంగ్త్ మహారాజ్, జిల్లా అధ్యక్షులు శివ నాయక్, మండల అధ్యక్షులు పరమేష్ నాయక్ మరియు జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



**టేకులపల్లి, జూలై30, ప్రజాజ్యోతి :** మండల పరిధిలోని (జీ )కొత్త తండా పాఠశాలలో త్రాగునీరు సౌకర్యం కల్పించాలని పాఠశాలలో చెత్త తొలగించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. విషయాన్ని ఉపాధ్యాయులు ఎంఇఓ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం మిషన్ భగీరథ అధికారులు వచ్చి నీటి సౌకర్యం పునరుద్ధరించారు. పాఠశాల ఆవరణలో చెత్త తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. అనంతరం యధావిధిగా పాఠశాల నిర్వహణ కొనసాగింది.

## శ్రీ రాంచంద్రరావుకు పాల్వంచ లో ఘన స్వాగతం



**పాల్వంచ, (టౌన్), జులై. 30.(ప్రజాజ్యోతి).** తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం తొలి సారి పాల్వంచకు వచ్చిన శ్రీ రాంచంద్రరావు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతించారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, నాయకులు పూల మాలలతో, హర్షధ్వానాలతో రాంచంద్రరావుకు ఆత్మీయంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, రాష్ట్రంలో బీజేపీని బలమైన ప్రత్యామ్నాయంగా నిలిపేందుకు రాంచంద్రరావు నాయకత్వం కీలకమని తెలిపారు. పాల్వంచ ప్రజలు మరియు పార్టీ కార్యకర్తల్లో ఈ పర్యటనతో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు పొనిశెట్టి వెంకటేశ్వర్లు ,బుడగం రవి,భూక్యా సీతారాం నాయక్ ,యడ్లపల్లి శ్రీనివాస్ , భూక్యా వెంకట్, రాజు, లక్ష్మణ్, వీరన్న, ప్రశాంత్, నరేష్, వెంకటరమణ , పద్మ, మల్లికా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## 04 లీటర్ల నాటుసారా పట్టివేత..

- బైక్ స్వాధీనం..ఒకరి అరెస్ట్



**కొత్తగూడెం బ్యూరో, జూలై 30,ప్రజాజ్యోతి:** కొత్తగూడెం ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిటిఏఫ్ ఎస్సై గౌతమ్ ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా చిట్టి రామవరం నుండి కొత్తగూడెం వస్తున్న అజ్మీర కిషన్ ద్విచక్ర వాహనంపై అనుమానం వచ్చి ఆపి తనిఖీ చేయగా ప్రభుత్వ నిషేధిత గుడుంబా ఉన్నట్లు గుర్తించి, పట్టుకున్న గుడుంబాను, ద్విచక్ర వాహనమును స్వాధీన పరుచుకొని కిషన్ పై కేసు నమోదు చేసినట్లు డిటిఎఫ్ ఎస్ఐ గౌతమ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిషేధిత మత్తు పదార్ధాలను అమ్మిన రవాణా చేసిన చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని, అలాగే బంగారు భవిష్యత్తు ఆగమవుతుందని వారు తెలిపారు.ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది రామకృష్ణ గౌడ్, హబీబ్ పాషా, గురవయ్య, సుమంత్, శ్రావణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉందాం

- ఈ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూట కట్టుకుంది.. బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే మెచ్చా
- పలకరింపులు.. పరామర్శలతో మండలంలో విస్తృతంగా పర్యటించిన మాజీ ఎమ్మెల్యే



**అశ్వారావుపేట, జూలై 30, ప్రజాజ్యోతి:** స్థానిక ఎన్నికలకు బిఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని, తెలంగాణలో ఏర్పడిన ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, అది స్థానిక సంస్థల ఎన్నికలతో రుజువు అవుతుందని మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన మండలంలో పలువురుని పలకరిస్తూ.. పరామర్శిస్తూ విస్తృతంగా పర్యటించారు ముందుగా ఆయన అశ్వారావుపేట శ్రీ శ్రీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన నిశ్చయ తాంబూలాల వేడుకకు హాజరై, నారాయణపురం గ్రామంలో ఆర్. పద్మావతి ఉద్యోగ విరమణ అభినందన సభలో పాల్గొన్నారు. నందిపాడు మాజీ సర్పంచ్ ఉకే వీరస్వామి ఇటీవలే పరమ పదించటంతో వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులు పరామర్శించారు.ఆసుపాక గ్రామంలో లకావత్ వెంకటేశ్వరరావు ఆరోగ్యం బాలేకపోవడంతో ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన అక్కడకు వచ్చిన కార్యకర్తలతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలైనా ఈ ఒక్క హామీని ఇచ్చిన మేరకు అమలు చేయలేదని, గత పది సంవత్సరాలలో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ రోడ్డు మీద నిలబడేలా చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ రోజు రైతుని పట్టించుకున్న పాపాన పోలేదని, అమలు చేయలేని హామీలు ఇచ్చి రైతులను కాంగ్రెస్ మోసం చేసింది అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు సంకా ప్రసాద్ ,మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ నారం రాజశేఖర్, చందా లక్ష్మీనరసయ్య, గోపి, కుమారస్వామి, మద్దాల రమణయ్య ,రాంబాబు, భూక్య నాగు, నల్లపు చందర్రావు, తదితరులు పాల్గొన్నారు.

# బంజారాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎస్టీ జాబితా నుండి బంజారాలను తొలగించేందుకు కుట్ర
- భద్రాచలం ఎమ్మెల్యేను పార్టీ నుండి సస్పెండ్ చేయాలి
- బంజారాల ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇవ్వలే...
- బంజారాలను నిర్వీర్యం చేసేందుకు రేవంత్ సర్కార్ కుట్ర.. ?
- అయిన కొందరు బంజర నేతలు అందులోనే కొనసాగడం సిగ్గుచేటు ..!
- ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాలోత్ గాంధీ నాయక్



**లక్ష్మీదేవిపల్లి, జూలై 30 , ప్రజాజ్యోతి :** బంజారాల సంక్షేమం కోసం పాటు పడాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం వారిని మోసం చేస్తుందని లక్ష్మీదేవిపల్లి బిజెపి మండల అధ్యక్షులు మాలోత్ గాంధీ నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జరిగిన బిజెపి ముఖ్య కార్యకర్తల సమావేశంలో గాంధీ నాయక్ మాట్లాడుతూ ఎస్టీ జాబితాలో నుండి బంజారాలను తొలగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని, దీనిని బంజారాలంతా ఐక్యమై తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ కు ఓటేసిన బంజారాలపై ఆ పార్టీ భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కేసులు పెట్టించడం విచారకరమన్నారు. కాంగ్రెస్ గెలుపుకు కృషి చేసిన బంజారాలపై కేసులు పెట్టించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, లేకపోతే మరో ఉద్యమం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో బంజారాలను ఓటు వేయమని అడిగిన కాంగ్రెస్ అభ్యర్థులు అధికారంలోకి వచ్చిన తర్వాత బంజారాలను విస్మరించడం అత్యంత బాధాకరమని ఆవేదన చెందారు. ఈ సందర్భంగా లగచర్ల భూముల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం బంజారాలపై ఉక్కు పాదం మోపి ప్రయత్నం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బంజారాలపై కాంగ్రెస్ ఇన్ని కుట్ర చేస్తున్న కొందరు బంజారా కాంగ్రెస్ పెద్దలు, నాయకులు నోరు విప్పకుండా అదే పార్టీలో ఉండడం సిగ్గుచేటు అన్నారు. బంజారాలపై జరుగుతున్న కుట్రలను గమనించి కాంగ్రెసులో ఉన్నవారు జాతి ద్రోహులని అయన పరిగణించారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్న బంజార ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వాలేదాని, ఈ జాతిని నిర్వీర్యం చేసేందుకే రేవంత్ సర్కార్ ప్రయత్నిస్తోందని అయన ఆరోపించారు



# రజబ్ ఆలీ నగర్ ను సందర్శించిన మండల విద్యాశాఖాధికారి

**అన్నపురెడ్డిపల్లి, జూలై 30, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలోని మహబూబ్ నగర్ గ్రామానికి సమీపంలో అడవుల మధ్య ఉన్న గోత్తికోయల పల్లె రజబ్ ఆలీ నగర్ ను మండల విద్యాశాఖాధికారి ఆనంద కుమార్, సెంటర్ ఫర్ ఫౌండేషన్ టీం, సమగ్ర శిక్ష జిల్లా టెక్నికల్ సభ్యుడు కార్తీక్, ఉపాధ్యాయులు కృష్ణ, బుచ్చయ్యల సహకారంతో మంగళవారం సందర్శించారు. ఈ గ్రామం నుంచి మహబూబ్ నగర్ ప్రాథమిక పాఠశాలకు 11 మంది విద్యార్థులు నడకదూరం నుంచి ప్రతిరోజూ చదువుకోడానికి వస్తున్నారని వారు తెలిపారు. గ్రామం పాఠశాలకి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ఉపాధ్యాయులు కృష్ణ, బుచ్చయ్యలు ప్రతిరోజూ పిల్లలను స్వయంగా తీసుకువచ్చి, పాఠశాల అనంతరం తిరిగి తాము వెళ్లించి భద్రంగా ఇంటికి చేర్చుతున్నట్టు పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల కోసం తీసుకుంటున్న శ్రమను అభినందించారు. గిరిజనుల్లో విద్య పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు చేస్తున్న కృషి ప్రశంసనీయం అన్నారు. అదేవిధంగా గ్రామస్థులతో మాట్లాడుతూ వారి పిల్లలను స్కూల్ కు పంపించాలనీ, చదువు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపకుండా కొనసాగించాలనీ సూచించారు. విద్యార్థుల రవాణా కోసం సదుపాయాలు కల్పించేందుకు సంబంధిత శాఖలతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు మేసా, చెన్న, గంగ పాల్గొన్నారు.



